ఆకట్టుకున్న భజన పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: పెద్దలతో పాటు చిన్నారుల్లో సైతం భక్తి భావం పెంపొందించేందుకు భజన భారతీ తెలంగాణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భజన పోటీలు నిర్వహిస్తున్నామని సమితి ప్రతినిధులు జోన్నకుంటి మధుసుదన్, సందుగారు శ్రీనివాస్‌లు తెలిపారు. భజన భారతీ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్వాన్ రాంసింగ్ పురాలోని బి.కె.భవన్‌లో భజన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పోటీలను నాలుగు విభాగాల్లో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా విజేతలకు పడాల అనంతకృష్ణ బహుమతులు అందించారు. మొత్తం 31 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయని ఆయన తెలిపారు.

'ఎమర్జెన్సీ సినిమాను నిలిపివేయాలి'


సినీనటి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిక్కు సంఘాల ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: ఎంపీ, సినీనటి కంగనారనౌత్ నటించిన ఎమర్జెన్సీ సినిమాను నిలిపివేయాలని నగరానికి చెందిన సిక్కు సంఘాలు డిమాండ్ చేశాయి. మేము తీవ్రవాదులం కాదు..దేశభక్తులం అంటూ ప్లకార్డులు పట్టుకొని ఆదివారం గౌలిగూడలోని సెంట్రల్ గురుద్వార్ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఎంపీ, సినీనటి కంగనారనౌత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలు సిక్కు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ..రైతులను బంగ్లాదేశ్ ఆందోళనకారులతో పోల్చడం ఎంత వరకు సమంజసమన్నారు.

రౌండ్ ది క్లాక్ సేవలో విద్యుత్ సిబ్బంది


అధికారులు సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న డీఈ హనుమంత్ రెడ్డి

చార్మినార్: వర్షాలకు అక్కడక్కడ చెట్లు కూలడంతో పాటు 11 కె.వి విద్యుత్ ఫీడర్ ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిదని, వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని టీజీ ఎస్పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ హనుమంత్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి రౌండ్ ది క్లాక్ సేవలో సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. తమ తమ పరిధిలో 23 చోట్ల 11 కె.వి విద్యుత్ ఫీడర్లు ట్రిప్ కాగా.. 4 చోట్ల చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడ్డాయని.. 2 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగిందన్నారు.

రమామెల్కొటేకు పురస్కారం ప్రదానం


రమామెల్కొటేకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణ దేవా రాయ తెలుగు భాషా నిలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రావిచెట్టు లక్ష్మీ నర్సమ్మ స్మారక పురస్కార ప్రదానం కార్యక్రమం ఆదివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగుభాషా నిలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి సభ్యురాలు సురభివాణిదేవి ముఖ్యఅతిథిగా హాజరై రమామెల్కొటేకు లక్ష్మీనర్సమ్మ స్మార పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ..ఉర్దూభాష చలామణి అవుతున్న రోజుల్లో తెలుగు భాషను సంరక్షించేందుకు శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషానిలయం స్థాపించబడిందన్నారు. ఈ భాషా నిలయం స్థాపన కోసం రావిచెట్టు రంగారావు, రావిచెట్టు లక్ష్మీ నర్సమ్మ ఎంతో పాటుపడ్డారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, డాక్టర్ చంద్రప్రకాష్‌రావు, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, టి.ఉదయవర్లు, డాక్టర్ ఫణింద్ర నాశేశ్వర్‌రావు, శ్రీరాములు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రైతురాయల స్వర్ణ చరితం


నృత్యరూపకాన్ని ప్రారంభిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలి అకాడమీ ఆధ్వర్యంలో రైతురాయల స్వర్ణ చరితం పేరిట ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత నృత్యరూపకం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ..నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. విజయనగర సామ్రాజ్యంలోని శ్రీకృష్ణ దేవారాయల చరిత్రను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారని కొనియాడారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మాజీ చైర్మన్ ఏబీకే ప్రసాద్, శ్రీకృష్ణ దేవారాయలు, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత భాగవతుల సేతురామ్, వ్యవసాయ విజ్ఞాన శాస్త్ర వేత్త గుడివాడ నాగరత్నం నాయుడు, పురావస్తు నిపుణులు ఈమని శివనాగిరెడ్డి, సంస్థ కార్యదర్శి కోక విజయలక్ష్మి పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం
- కూలిన చెట్లు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బస్తీలు, కాలనీలను అతలాకుతలమయ్యాయి. బస్తీలు, కాలనీల్లో కూడళ్లు చెరువు కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పండింది. ఇళ్లు, రెస్టారెంట్లు, షాపుల్లోకి వరద నీరు చేరి వస్తుసామగ్రి తడిసి ముద్దయ్యాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


దారుషిఫాలో నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది


మాలకుంటలో వరద ముంపు బాధితులకు ఆహారాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్


బల్కాపూర్ నాలా పరిసర ప్రాంతాలను సందర్శిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి


గంగానగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు


టోలిచౌకీ చౌరస్తాలోని రుమాన్ హోటల్‌లో వర్షపు నీరు


గోకుల్‌నగర్‌లో..


టోలిచౌకీ చౌరస్తాలో..


లలితాబాగ్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ పైకప్పు తెరుస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి



రహమత్ హోటల్‌లోకి వచ్చిన వర్షపు నీరు


బురదమయంగా మేకల మండి


రోడ్డుపై వరద నీటిని తొలగిస్తున్న షేక్‌పేట్‌లోని మార్నింగ్ వాకింగ్ గ్రూప్ సభ్యులు


టోలిచౌకీలో బల్దియా అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్


నదీమ్ కాలనీలో..

మూసీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జియాగూడ: గ్రేటర్‌లో రెడ్ అలర్ట్ నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం మేకలమండి సమీపంలో మూసీ వరద నీటి ప్రవాహ వేగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్లలో వరదనీరు పెద్ద ఎత్తున చేరడంతో గేట్లు ఎత్తి మూసీనదిలోకి వదలడం జరుగుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి రెండు గంటల ముందుగానే సహాయ శిబిరాలకు తరలించాలని ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు కలిగితే వెంటనే ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ నెం: 040–23202813, 90634 23979 లకు ఫోన్‌చేసి సమస్యలను తెలుపవచ్చన్నారు.


మూసీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పాతబస్తీలో చార్మినార్ జోనల్ కమిషనర్ పర్యటన


నాలా పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము రౌండ్ ది క్లాక్ సేవలను కొనసాగిస్తున్నామన్నారు. ఆదివారం ఆయన సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అక్కడక్కడ జరుగుతున్న నాలాల అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చార్మినార్ జోన్ పరిధిలోని ఆయా సర్కిల్స్ వారీగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉంచామన్నారు. పత్తర్ గట్టి మున్సిపల్ కార్పొరేటర్ సోహెల్ ఖాద్రి, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

మత్స్యకారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం


మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

అబిడ్స్: భారీ వర్షాలతో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మత్స్యకార రెస్క్యూటీమ్‌లను అప్రమత్తంగా ఉంచుతామని రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. నగరంతో పాటు అన్ని ప్రాంతాల్లో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, వారి సమస్యల పరిష్కారానికి భారీ వర్షంలో సైతం వారికి అండగా ఉండేందుకు మత్స్యకార రెస్క్యూటీమ్‌లను అన్ని ప్రాంతాల్లో ఉంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం మెట్టు సాయికుమార్ తన కార్యాలయంలో మాట్లాడుతూ..చెరువులు, కుంటలు, అలుగుల వద్ద ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి అలుగుపడుతున్న వరదలోకి ఎవ్వరిని వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత కూడా మత్స్యకారుల రెస్క్యూటీమ్‌లదే అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలు భారీ వర్షాలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉంచారని సాయికుమార్ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ అమ్రపాలి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ నలుమూలలా పర్యటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

గోషామహల్‌కు రూ.13 కోట్లు కేటాయించాలి


వాటర్‌బోర్డు ఎండీతో సమావేశమైన ఎమ్మెల్యే రాజాసింగ్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గానికి తాగునీటి సరఫరా, డ్రైనేజీ పనులకు రూ.13 కోట్లు విడుదల చేయాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమై మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా అల్లబండ రిజర్వాయర్‌కు మరింత సామర్థ్యం పెంచాలన్నారు. రూ.13 కోట్లు నిధులు విడుదల చేస్తే నియోజకవర్గంలో తాగు నీటి, డ్రైనేజీ సమ్య పరిష్కారమవుతుందన్నారు. ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

ముగిసిన శ్రావణమాస పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు రంగనాథ చార్యులు, శేషచారి, బద్రీనాథ్

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో శ్రావణమాసం పూజలు ఆదివారంతో ముగిశాయి. నెల రోజులుగా శ్రీదేవి, భూదేవి సమేతా రంగనాథస్వామి వారికి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు. ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాలలో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు, ఆరాధన, అభిషేకం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రతినిధి శేషాచార్యులు అర్చకులు రంగనాథచార్యులు, బద్రీనాథ్ మాట్లాడుతూ..ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చతుర్మాసం అంటారని ఆ సమయంలో నారాయణుడు విష్ణుమూర్తి యోగ నిద్రలోకి వెళ్తాడని లోకాన్ని పాలించేది లక్ష్మీదేవి అమ్మవారని, చతుర్మాసంలో లక్ష్మీదేవిని ఆరాధించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. సంతానం లేనివారు పూజిస్తే సంతానం కలుగుతుందని ప్రసిద్ధి అని తెలిపారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు


ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్‌లో చేరిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు

అఫ్జల్‌గంజ్: మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌లో జీహెచ్‌ఎంసీకి చెందిన దాదాపు 200 మంది ఉద్యోగులు చేరారు. జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్‌షరీఫ్ ఆధ్వర్యంలో వారు యూనియన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిల్‌షరీఫ్ మాట్లాడుతూ..ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగుల అభివృద్ధి కోసమే తమ యూనియన్ నిరంతరం పాటుపడుతుందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యాదగిరి, వెంకటేష్, శివకుమార్, నర్సింగ్‌రావు, నరేందర్, మహ్మద్ మోహీన్, హరినివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: మాజీ ఎమ్మెల్సీ కపిల్‌వాయి దిలీప్‌కుమార్ నాటి నుంచి నేటి వరకు ప్రజా శ్రేయస్సు కోసమే పనిచేశారని హరియాణా గవర్నర్ బండ్గారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్ రచించిన తెలంగాణ ఉద్యమంలో రాయని చరిత్ర పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. కేంద్రమాజీ మంత్రి అజిత్‌సింగ్ జ్ఞాపకాలతో కూడిన పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డాక్టర్ కత్తి వెంకటస్వామి, జయ వింధ్యాల పాల్గొన్నారు.

త్వరలో బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయం


మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో త్వరలోనే బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమని ఇక్కడ కాంగ్రెస్‌కు గట్టి ప్రత్యామ్నాయం బీజేపీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ బీజేపీ నాయకులతో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారని ఆయన అన్నారు. అదే విధంగా ఇచ్చిన హామీలను అమలు పరచక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రజల ఆదరణ బాగా తగ్గిందని ఆయన అన్నారు. గుల్బార్గ జిల్లా బీజేపీ ప్రభారి ఈశ్వర్‌సింగ్ ఠాకూర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి, అమర్‌నాథ్ తదితరులున్నారు.

మ్యాన్‌హోళ్లు తెరిస్తే చట్టరీత్యా చర్యలు


దారుసలాంలో పర్యటిస్తున్న వాటర్ బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్, విజయ రావు, సీజీఎం ప్రభు, జీఎం జాన్‌షరీఫ్

అబిడ్స్: ప్రజలు ఎలాంటి వాటర్‌బోర్డు సమస్యలు ఉన్నా మ్యాన్‌హోళ్లను స్వయంగా తెరిస్తే ప్రమాదాలు ఉన్నాయని వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్ పేర్కొన్నారు. భారీ వర్షంలో సైతం వాటర్‌బోర్డు డీటీపీ విజయ రావు, సీజీఎం ప్రభు, జీఎం జాన్‌షరీఫ్‌లతో కలిసి దారుసలాం, గోషామహల్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు మ్యాన్‌హోళ్లను స్వయంగా పరిశీలించారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ..ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటర్‌బోర్డుకు ఫిర్యాదు చేస్తే సంబంధిత మేనేజర్‌లు, డీజీఎంలు, జీఎంలు వెంటనే ఆయా సమస్యలను పరిష్కరిస్తారన్నారు. స్వయంగా మ్యాన్‌హోళ్లను తెరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. జీఎం జాన్ షరీఫ్, డీజీఎం దిలీప్, మేనేజర్‌లు గురునాథ్, కులశేఖర్ పాల్గొన్నారు.